ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన శంషాబాద్ డీసీపీ

షాద్‌నగర్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈనెల 13న ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నిక జరగనున్న విషయం విధితమే. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 487 ఓట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఓటరు జాబితాలో 239 మంది పురుషులు, 267 మంది మహిళలు, ట్రాన్స్ జెండర్ ఒక ఓటు మొత్తం 507 ఓట్లు ఉండగా 20 నకిలీ ఓట్లు ఉన్నాయని, వాటిని తీసి వేయగా మొత్తం 487 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

నాలుగు పోలింగ్ కేంద్రాలు

ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు నాలుగు చోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొత్తూరు మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కొందుర్గులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేశంపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, షాద్‌నగర్‌లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 13న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నట్లు తెలిపారు. అయితే పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరీ పరిశీలించారు.



కొత్తూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ కుశాల్కర్

రెండు రూట్లు

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు నియోజకవర్గంలో రెండు రూట్‌లను ఏర్పాటు చేశారు. కొత్తూరు నుంచి కేశంపేట, షాద్‌నగర్ నుంచి కొందుర్గుకు రెండు రూట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని ఈ రూట్‌ల ద్వారా ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ

కేశంపేట, కొత్తూరు మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి స్థానిక ఏసీపీ కుశాల్కర్, సీఐ బాల్‌రాజ్‌లతో కలిసి పరిశీలించారు. పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసులకు డీసీపీ ఆదేశించారు.

నాలుగు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు షాద్‌నగర్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాం. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– రాజేశ్వరీ, ఆర్డీఓ, షాద్‌నగర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, సీఐ మహేశ్‌గౌడ్

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మోకిల క్రీడా మైదానంలో అంకుర హోమ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంకుర లిటిల్ చాంపియన్–2023 వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. బాలికల వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ.20వేలు జిల్లా పరిషత్ పాఠశాల ప్రొద్దటూరుకు రాగా, రెండో బహుమతి రూ.10వేలు జిల్లా పరిషత్ జనవాడ విద్యార్థులు గెలుపొందారు. బాలురు వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ. 20వేలు జిల్లా పరిషత్ జనవాడకు రాగా, రెండో బహుమతి రూ. 10వేలు జిల్లా పరిషత్ కొండకల్ విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, మోకిల సర్పంచ్ సుమిత్రా మోహన్‌రెడ్డి, అంకుర హోమ్స్ సంస్థ సభ్యులు జైపాల్‌రెడ్డి, వెంకట్, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం పాల్గొన్నారు.

గ్రామస్తుల కృషితో రోడ్డు పనులు పూర్తి



మూసీవాగు రోడ్డుపై మట్టిని పోయిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: ఎవరో వస్తారు... ఏదో చేస్తారని గత కొన్ని సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నా రోడ్డు పనులు గ్రామస్తులకు నిరాశే మిగిలింది. దీంతో శనివారం చిన్నమంగళారం గ్రామస్తులంతా కలిసి గ్రామం నుంచి మహారాజ్‌పేట్‌కు వెళ్లే మూసీ వాగు రోడ్డును మట్టిపోసి చదును చేశారు. గత 5–6 నెలల నుంచి మూసీవాగు దాటి వెళ్లలేక వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మహారాజ్‌పేట్, శంకర్‌పల్లి వెళ్లాలంటే పొద్దుటూరు మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోయారు. గ్రామస్తులంతా కలిసి శనివారం చిన్నమంగళారం నుంచి వాగుదాటేందుకు రోడ్డును జేసీబీతో చదును చేసి మట్టి పోయించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. మూసీవాగుకు బ్రిడ్జి మంజూరైన ఇప్పటికి పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. పలుమార్లు మూసీ వంతెనకు నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నప్పటికీ కనీసం రోడ్డునైనా వేయాలని గ్రామ స ర్పంచ్ సుకన్యహరిశంకర్‌గౌడ్‌ను కోరినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులందరు కలిసిరోడ్డు వేశా రు.వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటమి భయంతోనే ఎన్నికలు వద్దంటున్నారు

- అంతిరెడ్డిగూడ ఎన్నికలను అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్
- అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ గ్రామాల్లో వినూత్నంగా భిక్షాటన

నందిగామ: అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి నిర్వహించాల్సిన ఎన్నికలను అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఓటమి భయంతోనే అడ్డుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ గ్రామస్తులు శనివారం సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అయ్యే ఖర్చు నిమిత్తం ఆయా గ్రామాల్లో వినూత్నంగా భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన వంతు సహాయంగా వీర్లపల్లి శంకర్ రూ.25 వేలను అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీ చేయాల్సిన ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారని, దీంతో హైకోర్టు జంగోనిగూడతో కలిసిన అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి 8 వారాల్లో ఎన్నికలను నిర్వహించాలని ఇటీవల తీర్పు చెప్పిందన్నారు. అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో అధి కార పార్టీ నేతలు సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అంతిరెడ్డిగూడకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలవుతామని అర్థం చేసుకున్న బీఆర్‌ఎస్ నేతలు స్టే తెచ్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేపల్లి కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జంగ రజినికాంత్, డైరెక్టర్ అంజి యాదవ్, అప్పారెడ్డిగూడ ఉప సర్పంచ్ సీతారాం, నాయకులు , ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న శంకర్

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు..

చేవెళ్ల: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ చేవెళ్ల మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం కవితపై బండి సంజయ్ చేసిన వాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి పోలీస్‌స్టేషన్‌లోకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదేశాల మేరకు చేవెళ్లలో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. బండి సంజయ్ మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడడం సరైనది కాదని మీ ఇంట్లో కూడా మహిళలు ఉన్న విషయం మరిచిపోవద్దన్నారు. బండి సంజయ్ అనే నాయకుడు ఫుట్‌పాత్ నాయకుడని విమర్శించారు. బీజేపీకి రాష్ట్రంలో రోజురోజుకి ఆదరణ తగ్గడంతో తట్టుకోలేక రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడమే ఆయన పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. తన వెనుక కేంద్రం సహకారం ఉంది కాదా అని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావని నిన్ను కాపాడాటానికి గుజరాత్ నుంచి ఎవరూ రారని గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, నాయకులు పి. ప్రభాకర్, నర్సింలు, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి మల్లేశ్, నరేందర్, రాజు, వెంకటేష్, రవీ, మోసిన్, నరహరిరెడ్డి, సాయి, యాదయ్య, కుమార్,గని, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో రోడ్డుపై బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బండి సంజయ్‌ని బహిష్కరించాలి

కేశంపేట: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీజేపీని ప్రజలు కప్పిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కించుకోదని అందుకే మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆమె అన్నారు. బండి సంజయ్‌ను వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సంజయ్ రాష్ట్రంలో ఎక్కడ కన్పించిన మహిళలు తిరుగబడుతారని ఆమె చెప్పారు.

చేగూరులో పోలీస్ పికెట్

నందిగామ: మండల పరిధిలోని చేగూరు శివారులో శనివారం స్థానిక ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. చేగూరు, కాన్హాశాంతి వనం సమీపంలో ఓ భూమి వివాదంలో ఇరువర్గాల వారు పెద్ద మొత్తంలో అక్కడ తిష్ట వేయడంతో వారిని పోలీసులు అక్కడి నుంచి తరిమివేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందు జాగ్రత్తగా పికెట్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

మున్సిపల్ చైర్మన్ నరేందర్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నరేందర్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నేత మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావాన్ని పెంపొందించుకుంటే మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు ఎంసాని శ్రీనివాస్, తాటికెట్టి ప్రకాష్, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్ లాల్ లాహోటీ, భగవాన్‌దాస్, గజానంద్, చగన్ మలానీ, కీర్తి శ్యాం, రాజేష్, సాయిమిత్ర అసోసియేషన్ సభ్యులు సురేందర్, జాన్‌వెస్లీ, శ్రీశైలం, కుమార్, బాలు, అర్చకుడు వికాస్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌కు చేరుకున్న స్వరాజ్య పాదయాత్ర

షాద్‌నగర్‌టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రాజ్యస్థాపన కోసం డీఎస్పీ (దళితశక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర శనివారం షాద్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొండన్నగూడ, దూసకల్ గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందితే దొరలు పోయి మళ్లీ దొరసానులు రాజ్యం ఏలుతారన్నారు. రాజ్యాంగంలోని మూల సూత్రాలు ప్రచారం చేయడం, రాజ్యాధికారం సాధించి భారత రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం కోసం పాదయాత్ర చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్, రాజు, బ్రహ్మయ్య, రాఘవేంద్ర, మంగ మధు, అంచరాములు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం
- పది రోజులుగా ఇరువర్గాల మధ్య శ్మశానవాటిక వివాదం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన అంజయ్య

చేవెళ్ల: తమ వర్గానికి అన్యాయం చేస్తున్నారంటూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువకుడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. పెట్రోల్ బాటిల్ పట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం కలకలం రేపింది. వివరాలు.. చేవెళ్ల మండలం దామరగిద్దలో పాత, కొత్త శ్మశాన వాటికల విషయమై పది రోజులుగా వివాదం కొనసాగుతోంది. సర్వే నంబర్ 54లో ప్రభుత్వం శ్మశాన వాటికకు స్థలం కేటాయించింది. ఇక్కడ బీసీ సామాజికవర్గం సభ్యులు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. పాత శ్మశానవాటిక ఇళ్లకు దగ్గరగా ఉందని, దీంతో అంత్యక్రియలు చేయవద్దని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పరస్పరం దాడులు సైతం చేసుకున్నాయి. ఈ క్రమంలో బీసీ వర్గానికి చెందిన మహిళ మృతి చెందడంతో శుక్రవారం రాత్రి దామరగిద్దలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఆగ్రహించిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన అంజయ్య ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు నచ్చజెప్పి అతడిని కిందకు దింపారు. అనంతరం క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అధికారులు తమకు న్యాయం చేయడం లేదని, ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాగా, దామరగిద్దలో శ్మశానవాటిక విషయమై కలెక్టర్‌తో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరూ ఆవేశాలకు లోనుకావొద్దని, చర్చల ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

కృషి, పట్టుదలతో విజయం మీ వెంటే

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు



సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే విజయాలు మీ వెంటే ఉంటాయని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం శివారులో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల 25 సంవత్సరాలను పూర్తి చేసుకొని 26వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో శనివారం సిల్వర్ జూబ్లీ, పాఠశాల వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే బక్కనినర్సింలు హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బక్కని నర్సింలు మాట్లాడుతూ...ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. లక్ష్య సాధనకోసం ప్రణాళికాబద్ధంగా నిరంతరం సాధనచేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కమ్మదనం సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ అమర్‌నాథ్, అధ్యాపకులు హేమలత, శారద, శ్రీవాణి, జయలక్ష్మి, ప్రణీత, రమ్యభార్గవి, రోజమ్మ, అనిత, సుసన్న, శిరీష, లక్ష్మిబాయి, చంద్రకళ, స్వర్ణమంజరి, చంద్రకళ, నర్సింహ్మాచారి, పాషా, గోపాల్, శ్రీకాంత్, శేఖర్, యాకుబ్, ఐలేష్, శివకుమార్, శ్రీనివాస్, నర్మద, లావణ్య, గవ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఇంటివద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో పదవులు వస్తాయని, వారిని పార్టీ గుర్తిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొత్తపేట గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, నరేష్‌యాదవ్, గణేష్‌గౌడ్, కుంటి లక్ష్మయ్య, నవీన్, రాఘవేందర్‌రెడ్డి, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

సీఐ గురువయ్యగౌడ్

షాబాద్: ట్రాఫిక్ రూల్స్, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన్నట్లు షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ధాన్యహిత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, వినూత్న రీతిలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. 5జీ సేవలు అందుబాటులోకి రావడంతో సైబర్ మోసగాళ్ల పట్ల విద్యార్థులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసగాళ్లు అమాయకుల ఖాతాలు కొల్లగొట్టేందుకు ఏ దారినీ వదలడం లేదన్నారు. ఫోన్ చేసి లేదా మెసేజ్ పంపి ఓటీపీ చెప్పమని అడిగితే తొందరపడి క్లిక్ చేయొద్దని తెలిపారు. ఇదే అదునుగా తీసుకొని సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఇద్దరు దొంగల అరెస్ట్..

రిమాండ్‌కు తరలింపు



బైక్‌లు, సిలిండర్లను చూపుతున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో జరుగుతున్న దొంగతనాలపై నిఘా పెట్టిన పోలీసులకు ఇద్దరు దొంగలు దొరికారు.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి....ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన సుక్కప్రశాంత్(25), పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన ఎండీ.సోహైల్ (21) శనివారం పట్టణంలోని పద్మావతి కాలనీలో మూడు కమర్షియల్, మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌ను విక్రయిస్తున్నారు. కాలనీలో సిలిండర్లను అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అనుమానాస్పదంగా సిలిండర్లను విక్రయిస్తూ కనిపించిన సుక్కప్రశాంత్, ఎండీ.సోహైల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారించగా ఈ నెల 9న రాత్రి టీచర్స్‌కాలనీలోని హనుమా న్ దేవాలయం వద్ద నిలిపిన బొలెరో వాహనంలో ను ంచి సిలిండర్లను దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నారు.

తీగ లాగితే డొంక కదిలింది

పోలీసుల విచారణలో మరిన్ని దొంగతనాలు బయటపడ్డాయి. సుక్కప్రశాంత్ గత నెల రోజుల క్రితం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల ఏటీఎం సెంటర్‌లో దొంగతనం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. గత 15 రోజులు క్రితం మహబూబ్‌నగర్ జిల్లా బూత్పూర్ మండల పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, వారం రోజుల క్రితం జడ్చర్లలో మరో ద్విచక్ర వాహనం, షాద్‌నగర్‌లో రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించనట్లు నిందితుడు సుక్కప్రశాంత్ ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులను ఏసీపీ కుషాల్కర్ అభినందించారు. వారికి పోలీసు ఉన్నతాధికారుల ద్వారా రివార్డులను ఇప్పించడం జరుగుతుందని ఏసీపీ తెలిపారు.

క్లుప్తంగా

చిలుకూరులో నేటి నుంచి బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో ఆదివారం నుంచి మూడు రోజులపాటు బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు కురుమ సంఘం నాయకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లికార్జున స్వామి బోనాల ఊరేగింపు, స్వామివారి కల్యాణోత్సవం, అగ్నిగుండాలు, ఉక్కుగొలుసు తెంపుట కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం బీరప్పస్వామి గంగస్నానం, మధ్యాహ్నం బోనాల ఊరేగింపు, బీరప్ప కామరాతి కల్యాణోత్సవం, కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం బీరప్పస్వామి, కామరాతి దేవి నాగవల్లి నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగిస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కనీస సాకర్యాల కల్పనలో విఫలం

కొత్తూరు: మండలంలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పనిచేసే చోట వారికి కనీస రక్షణ పరికరాలు సమకూర్చని కారణంగా ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడుతున్నారని ఆరోపించారు. అధికారులు కూడా సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు రావడం.. నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప మరోమారు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలను సమకూర్చాలని, పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ప్రకటించిన తిరుపతిరెడ్డి

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేత చెంది తిరుపతిరెడ్డి రూ.1,11,111 విరాళాన్ని ప్రకటించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటేష్ గుప్త, వెంకటయ్యలు శనివారం చెంది తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్లి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన నిర్మాణం కోసం తన వంతు సహాయం అందజేస్తానని తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలి

కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్

కేశంపేట: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ హస్తం–పేదల నేస్తం కార్యక్రమాన్ని మండల పరిధిలోని సంతపూర్, కొనాయపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 500లకే సిలిండర్ అందిస్తామన్నారు. అలాగే, సంతపూర్ గ్రామంలో ఇల్లులేని అంజమ్మకు ఇంటి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చౌలపల్లి ఎంపీటీసీ రాజు,దినేష్ సాగర్, మధు, వంశీగౌడ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం

వాసవీ క్లబ్ సభ్యులు దూరయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

షాద్‌నగర్: వాసవీ, వనితా క్లబ్‌సభ్యులు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు దూరయ్య అన్నారు. శనివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న రామలింగేశ్వర సహకార సంఘం భవనంలో వాసవీ, వనితా క్లబ్‌సభ్యుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దూరయ్య మాట్లాడుతూ... వాసవీక్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న వారిని ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పది మంది చిరు వ్యాపారులకు పదివేల చొప్పున వడ్డీలేని రుణాల పంపిణీ, పది రూపాయలకే భోజనం క్లబ్ ద్వారా నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా వినోద్‌కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా కట్టదివ్య, ప్రధాన కార్యదర్శిగా సంగీత, కోశాధికారిగా లావణ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాండురంగయ్య, భాస్కర్‌గుప్త, ఎల్కుర్తి శ్రీనివాస్, పాలాది వెంకటరమణ, రవికుమార్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.